ప్రజాశక్తి

శుక్రవారం 11 ఏప్రిల్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తాగునీరూ కరువే..!

◆ రాంబిల్లి మండలంలో దాహం కేకలు ◆ లోవపాలెంలో ఎక్కడ చూసినా సాల్ట్ వాటర్

◆ ఇబ్బందుల్లో ప్రజలు ◆ పట్టించుకోని ఎమ్మెల్యే, ఎంపీ, అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి విలేకరి

యలమంచిలి నియోజకవర్గం పరిధి రాంబిల్లి మండలంలో పలు గ్రామాల ప్రజలకు తాగునీరు కరువైంది. పట్టించుకోవాల్సిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ గ్రామాలవైపు కన్నెత్తి చూడటం లేదు. వెరసి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మండలం లోని జెడ్ చింతువ పంచాయతీ లోవపాలెంలో ఉప్పునీటి సమస్య తీరని వేదనను మిగులుస్తోంది. ఈ గ్రామంలో 70 మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయి. ఎన్‌టిఆర్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటి నుంచీ అవి ఇక్కడే ఉంటున్నాయి. వీరికి తాగడానికి మంచినీరు లేదు. ఉన్న బోర్లలో ఉప్పునీరు వస్తోంది. తాగునీటికి ఇబ్బందులుపడుతున్న ఈ గ్రామానికి జలజీవన్ మిషన్ కింద మంచినీటి సౌకర్యం కల్పించలేదు. రోజువారీ ఆదాయమున్నా, లేకపోయినా ప్రజలు తాగునీటికి రోజుకు రూ.30 నుంచి రూ.40 ఖర్చు పెడుతున్నారు. మంచినీరులేక రోజువారీ అవసరాలకు ఉప్పునీరు వాడుతున్నారు. ప్రజల ప్రాథమిక అవసరమైన మంచినీటి సౌకర్యాన్ని కల్పించలేని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఎంపీ సిఎం రమేష్‌లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్న లోవపాలెం గ్రామం



లోవపాలెంలో కుండీలోకి ఊరుతున్న ఉప్పునీరు

సిపిఎం ప్రజా చైతన్యయాత్రతో సమస్యలు వెలుగులోకి..

గత నెలలో సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్యయాత్రలో మిగతా 2లో..



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవం ఈ నెల 30న జరగనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఉత్సవాన్ని సజావుగా, శోభాయమానంగా నిర్వహించేందుకు గురువారం సాయంత్రం ఆయన అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా అన్ని విభాగాలూ సమన్వయంతో పనిచేయాలని, టిక్కెట్ల విక్రయం నుంచి వాహనాల నిర్వహణ వరకూ ప్రతి అంశాన్నీ ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని అన్నారు. ఈ నెల 29 సాయంత్రం 6 గంటల నుంచి సాధారణ దర్శనాలు నిలిపివేయనున్నట్టు తెలిపారు. రూ.1000, రూ.300 ధరల టిక్కెట్ల విక్రయాన్ని అనుకూల ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు పాసులు జారీ చేయాలని, కొండపైకి, దిగువకు భక్తుల రవాణా కోసం తగిన సంఖ్యలో ఆర్‌టిసి బస్సులను అందుబాటులో ఉంచాలని అన్నారు. తాగునీరు, మజ్జిగ కేంద్రాలు, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లను విస్తృతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్, సైన్ బోర్డులు, శాశ్వత పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ సమస్య నివారణకు అదనపు స్థలాలను అభివృద్ధి చేయాలన్నారు. పోలీస్ మిగతా 2లో..

దొడ్డి రామునాయుడుకు ఘన నివాళి

▶ వార్త 5లో..

కోరాడ నాగభూషణరావు ఆత్మహత్య

▶ వార్త 3లో..

రాపిడో డ్రైవర్‌పై దాడి : నగదు దోపిడీ

▶ వార్త 3లో..

టిడిఆర్‌లు ఇస్తామనడం చట్ట ఉల్లంఘన

◆ బాధితులకు ప్రత్యక్షంగా పరిహారం ఇవ్వాలి

◆ కలెక్టర్‌కు కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్.శర్మ లేఖ



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణకు గతంలో 11 గ్రామాల్లో జారీ చేసిన 2013 భూసేకరణ చట్టం నోటిఫికేషన్‌ను వెనక్కు తీసుకుని, భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి టిడిఆర్ సర్టిఫికెట్లు ఇస్తామనడం చట్టాన్ని ఉల్లంఘించినట్లవుతుందని కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్.శర్మ అన్నారు. టిడిఆర్ బదులు 2013 చట్టం కింద బాధితులకు ఉదారంగా నష్ట పరిహారం ఇవ్వాలని గురువారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. 'ఏ కారణం వల్లనో 2013 భూ సేకరణ చట్టం నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు పోగొట్టుకుంటున్న బాధితులకు ఈ రోజు వరకు చట్ట ప్రకారం నష్టపరిహారం లభించలేదు. నష్టపరిహారానికి బదులు టిడిఆర్‌లు ఇస్తామని మీటింగ్‌లు పెట్టి ఒత్తిడి చేస్తున్నారు. రోడ్డు విస్తరణ ప్రభావంపై క్షుణ్ణంగా నిపుణులతో అధ్యయనం చేయించి, నివేదిక సమర్పించి బాధితుల సమ్మతి ముందుగా తీసుకోవాలి' అని ఆయన అన్నారు. నష్టపరిహారాన్ని ప్రత్యక్షంగా ఇవ్వకుండా భూములు, ఆస్తులను సేకరించకూడదన్నారు. చట్ట ప్రక్రియను పక్కనబెట్టి టిడిఆర్‌లు ఇస్తామనడం 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించినట్లవుతుందని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని భంగపరిచినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో 2013 చట్టం కింద బాధితుల సమ్మతి తీసుకొని, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కలెక్టర్ జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

తక్షణం జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహారాణిపేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థకు ఉన్న ఎకరా స్థలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని పబ్లిక్ లైబ్రరీ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జగదాంబ జంక్షన్ సమీపంలోని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పౌర గ్రంథాలయాల సేవా సమితి అధ్యక్షులు బిఎల్.నారాయణ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఆయనకు వినతి పత్రం అందజేసింది. గ్రంథాలయ భవనం పునర్నిర్మాణానికి జోక్యం చేసుకోవాలని వినతిపత్రంలో కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. పనులను తక్షణం ప్రారంభించాలని సంబంధిత పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ ఇంజినీర్లను ఆదేశించారు. పనులలో అడ్డంకులు ఎదురైతే వెంటనే తనను సంప్రదించాలని సూచించారు. పది రోజులలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, అధికారులు, పెన్షనర్లు, గ్రంథాలయ అభిమానులతో విశాఖపట్నంలో సమావేశం ఏర్పాటు చేస్తానని డైరెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్షులు బిఎల్.నారాయణ మీడియాతో మాట్లాడుతూ పబ్లిక్ లైబ్రరీ డైరెక్టర్ కృష్ణమోహన్ స్పందించిన తీరు ప్రజలలో, విద్యార్థులలో, విశాఖ నగరంలోని పఠన ప్రియులలో నూతన ఆశ కలిగిస్తోందన్నారు. పాతకాలం నుంచి విద్యా సాంస్కృతిక కేంద్రంగా నిలిచిన జిల్లా గ్రంథాలయం నూతన భవనం త్వరలోనే పునర్నిర్మాణం జరుగుతుందన్న ఆశావాహ వాతావరణం ఏర్పడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్.వెంకటరావు, జిల్లా పౌర గ్రంథాలయ సేవా సమితి కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి పి.మల్లేశ్వరరావు, పెన్షనర్ల సంఘం నాయకులు పి. పైడిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ మోహన్, చిత్రంలో పౌర గ్రంథాలయ సేవా సమితి నాయకులు

విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 12న సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ శనివారం ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని ఐదు జిల్లాల కార్మికులతో విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రైవేటు, కాంట్రాక్ట్, పీస్ రేట్ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పిఆర్‌సిలో జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని కోరారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని, కూటమి ప్రభుత్వమైనా కష్టాలను అర్థం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సదస్సుకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు యు.సూరిబాబు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజశేఖర్, ముజఫర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సదస్సులో పర్మినెంట్, కాంట్రాక్ట్, పీస్ రేట్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. పెద్ద ఎత్తున కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి..



ఖాళీ నీటి బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు, సిపిఎం నాయకులు (ఫైల్‌ఫొటో)

తాగునీరూ కరువే..!

పలు సమస్యలు వెలుగుచూశాయి. లోవపాలెం, యాత కొత్తపట్నం, నేవీ కాలనీ, అప్పారాయుడుపాలెం, లాలం కోడూరు, చిన్న కలవలపల్లి గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్న దృశ్యాలు ఎక్కడికక్కడ కానవచ్చాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు తమకు తాగునీటిని అందించాలని పలుమార్లు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కానరాలేదు. దీంతో గత నెల 25న మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో భారీ ఆందోళనకు దిగారు. వారినుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడారు. ఫార్మా, సెజ్ కంపెనీలు శుద్ధి చేయకుండా నేరుగా విడిచిపెడుతున్న రసాయన వ్యర్థ జలాలు వల్ల లాలం కోడూరు, కృష్ణంపాలెం, జెడ్.చింతువ ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. తోటపాలెం సమీప ప్రాంతంలోని పరిశ్రమలు శుద్ధి చేయకుండా వ్యర్థాలను కాలువల్లోకి విడిచిపెట్టడంతో నీరు ఎర్రగా మారుతోంది. రోడ్డు పక్కనుంచి వెళ్లినవారు, పరిసర గ్రామాల ప్రజలు వాసన భరించలేక బాధపడుతూ జీవితాలు గడుపుతున్నారు. కలుషితనీరు తాగిన పశువులు, మేకలు చనిపోతున్నాయని చెల్లూరు రాజబాబు చెప్పాడు. సీతపాలెం, లోవపాలెం, పెదిరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం, పెద్ద ఈతపాలెం, రామచంద్రపురం, లాలంకోడూరు సహా పరిశ్రమల సమీప గ్రామాల ప్రజలు వాయు కాలుష్యంతో పడరానిపాట్లు పడుతున్నారు. ఈ బాధలన్నీ ఓర్చుకొని బతుకుతున్నా సిఎస్ఆర్ నిధులతో తాగునీటి సౌకర్యాన్ని పరిశ్రమలు కల్పించడంలేదని లోవపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

కమిషనర్ శంకబ్రత బాగ్చీ మాట్లాడుతూ చందనోత్సవం జరిగే ప్రతిచోటా కొండపైన, దిగువునా సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ కోసం అదనపు స్థలాలు కేటాయించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ అధికారులు, సింహాచలం ఆలయ ఇఒ కె.సుబ్బారావు, రెవెన్యూ, వైద్య, రవాణా, ఆర్‌టిసి, జివిఎంసి, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తరగతుల విలీనంపై ఒత్తిడి తగదు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విలీనంపై ఎస్ఎంసి కమిటీలతో సంతకాలు చేయించేందుకు ఉపాధ్యాయులపై విద్యా శాఖాధికారులు తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడాన్ని యుటిఎఫ్ విశాఖ జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్కరణల పేరుతో ప్రాథమిక విద్యా రంగాన్ని విధ్వంసం చేయడం తగదని పేర్కొన్నారు. దుందుడుకు చర్యలతో ముందుకెళ్తే ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి మహోత్సవాన్ని ఈ నెల 14న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎల్‌ఐసి దరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలంకరణ, అనంతరం పుడ్ కోర్టు సమీపంలో పబ్లిక్ మీటింగు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని, ఈ మేరకు అన్ని రకాల ఏర్పాట్లూ చేస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యాటకాభివృద్ధి పేరిట సహజ వనరుల దోపిడీకి కుట్ర

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: టూరిజం అభివృద్ధి పేరుతో గిరిజన ప్రాంతంలో ఉన్న సహజవనరులు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ చూస్తూ ఊరుకోబోమని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర హెచ్చరించారు. అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం కేంద్రంలో ప్రభుత్వం ఐటిడిఎ ఆధ్వర్యంలో టూరిజం అభివృద్ధి పేరుతో ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాలతో వర్క్‌షాప్ నిర్వహించారన్నారు ఏజెన్సీ ప్రాంతాల్లో గనులు, అటవీ భూములు, ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, వంటి సహజవనరులను టూరిజం పేరుతో ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులంతా టూరిజం అభివృద్ధి పేరుతో 1/70 చట్టాన్ని ఉల్లంఘనపై తీవ్రంగా వ్యతిరేకించారన్నారు.

కలుషిత నీటి సమస్యపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓల్డ్ టౌన్ ఫిషింగ్ హార్బర్ సమీపంలోని 38వ వార్డు బుక్కా వీధిలో జివిఎంసి కుళాయిల్లో డ్రైనేజీ నీరు కలుస్తోందని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం బుక్కా వీధిలో మహిళలు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు ఆ ప్రాంతంలోని కలుషిత నీటిని బాటిళ్లలో నింపి తీసుకొచ్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బుక్కా వీధి ప్రాంతంలో మత్స్యకారులు నివాసం ఉంటున్నారన్నారు. ఈ ప్రాంతంలో మంచి నీటి కుళాయిలో మురుగునీరు కలిసిపోయి తాగడానికి పనికిరావడం లేదన్నారు. మానవ విసర్జాలు నీటిలో కనిపిస్తున్నాయని తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి ఇదే నీరు ఈ ప్రాంతానికి వస్తున్నా ఎవ్వరికీ పట్టడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.నర్సింగరావు, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి పాల్గొన్నారు.



కలుషిత నీటిని చూపుతున్న మహిళలు

బస్సు స్టేషన్లలో చలివేంద్రాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వేసవి తీవ్రత దృష్ట్యా ఆర్‌టిసి విశాఖ రీజియన్ పరిధిలో అన్ని బస్సు డిపోల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎపిఎస్ ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ద్వారకా బస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు, సిబ్బందికి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ద్వారకా బస్ స్టేషన్ డిప్యూటీ సిటిఎం జి.సత్యనారాయణ, ఎటిఎం పిబిఎంకె.రాజు పాల్గొన్నారు.

ఆర్థిక రుణాల యాక్షన్ ప్లాన్ విడుదల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎస్‌సి మాల కార్పొరేషన్ సంస్థ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ రుణాలను మాల లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎపి రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య కోరారు. గురువారం స్థానిక ప్రగతి భవన్ ఎస్‌సి మాల కార్పొరేషన్ సంస్థ కార్యాలయ ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

నేటి నుంచి పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్డు సమీపంలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఈనెల 11, 12, 13 తేదీలలో ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ ఎక్స్‌పో (పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన) నిర్వహిస్తున్నామని ఇండోర్ ఇన్ఫోలైన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.కె.అగర్వాల్ తెలిపారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక ఉత్పత్తులను స్థానిక మార్కెట్లో విక్రయించేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందని, నూతనంగా వ్యాపారం చేయాలనుకునే వారికి, డీలర్ షిప్పులు తీసుకునేందుకు ఆసక్తి ఉన్నవారికి ఈ ఎక్స్‌పో ఉపయోగకరమని ఆయన అన్నారు. ఈ ఉత్పత్తుల విక్రయం ద్వారా ఉపాధి లభిస్తుందని, ఈ ప్రదర్శనను వరుసగా రెండో సంవత్సరం నిర్వహిస్తున్నామని, గత ఏడాది నిర్వహించిన ప్రదర్శనకు 6500 మంది సందర్శకులు వచ్చారని తెలిపారు. సుమారు 25 కోట్ల వ్యాపారం అయినట్టు వెల్లడించారు. ఈసారి సందర్శకుల సంఖ్య 10 వేలు దాటుతుందని తాము ఆశిస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఈ ప్రదర్శనలో తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు 50 పరిశ్రమలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయని, ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6:30 గంటల వరకు నిర్వహించే ప్రదర్శనకు ప్రవేశం ఉచితమని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శన ఉత్పత్తిదారులకు, అమ్మకందారులకు, వినియోగదారులకు ఒక సంయుక్త వేదిక అవుతుందని పేర్కొన్నారు.

జన జాగృతికి కళలు దోహదం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భవిత బాటకు కళలు బాష్యం చెబుతాయని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ అన్నారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభావంతుల ప్రోత్సాహ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చోటు చేసుకుంటున్న అంశాలపై ప్రజల్లో అవగాహన కలిగించడంతో పాటు జన జాగృతికి కళలు ఎంతో తోడ్పడుతున్నాయన్నారు. విశాఖ జిల్లాలోని ప్రతిభావంతులైన ఎంతోమంది కళాకారులు ఉన్నారని, ఎన్నో సందర్భాల్లో విఎంఆర్‌డిఎ వారిని ప్రోత్సహించిందని అన్నారు. ప్రభుత్వ పరంగా కళా కారులకు తగిన సహకారం అందిస్తామన్నారు. కళాకారుల సంక్షేమ సేవా సంఘం గౌరవాధ్యక్షులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ విశాఖలో ఉన్న ప్రతిభావంతులను జిల్లా యంత్రాంగం మరింతగా ప్రోత్సహించాల్సి ఉందన్నారు. గతంలో వలే స్థానిక ఉత్సవాల్లో ప్రాంతీయ కళా ప్రతిభకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. సంస్థ ప్రధాన సలహాదారులు, అంతర్జాతీయ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజ్ పట్నాయక్, విశాఖ జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు క్యాలు జనార్ధన్, సినీ దర్శకులు యాద కుమార్, నంది అవార్డు గ్రహీత శివ జ్యోతి, ప్రజాపిత బ్రహ్మకుమారీ స్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి బికె.రామేశ్వరి, ఈ టీవీ పాడుతా తీయగా సంగీత కళాకారులు కీరవాణి ప్రసాద్, ధనుంజయ, తాళ్లపాక సందీప్, పక్కి అరుణ్ సాయి, కరెమ్ మమత పాల్గొన్నారు. ఓలేటి ప్రసాద్, సింగూరు సత్యనారాయణ తదితరులను సత్కరించారు. .

మహారాజశ్రీ అనకాపల్లి 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP 95/2023 IN OS 22/2022

డిక్రీహోల్డర్:
సావళ్ళ ఎల్లాజీ ....DHR
అండ్
వీర్ని వరలక్ష్మి .... JDR

ఆర్డర్ 21 రూల్ 34 నోటీస్

టు
వీర్ని వరలక్ష్మి భర్త లేటు వీర్ని శ్రీనివాసు. వయసు 30 సంవత్సరములు. గృహిణి. డోర్ నెంబర్ 13-9-20/A బోయిన వారి వీధి. అనకాపల్లి, అనకాపల్లి జిల్లా.

పై నెంబర్ దావాలో డిగ్రీ పొందిన ఆస్తిని క్రయ చీటీ చేయించమని కోరుచూ పై నెంబర్ ఈపీ దాఖలు చేసి ఉన్నారు. సదరు ఈపీ యందు శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **21-4-2025వ తేదీకి** వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు **ఉదయం10:30 నిమిషములకు.** మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్ గారు గానీ పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపనలు తెలుపుకొనవలెను. లేనిచో మీ వరోక్షమందు పై నెంబర్ ఈ తీర్మానించబడును.

పీలా గంగాధర్
అడ్వకేట్, అనకాపల్లి.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.22/2020 O.S. 67/2015

DHR : మళ్ల శివ సత్యనారాయణ
JDRs : గెద్దం అప్పారావు (died) వగైరాలు

నోటీసు

JDR's 2 & 3:
2. గెద్దం కిరణ్‌కుమార్, తండ్రి లేటు అప్పారావు, హిందూ, R/o. పాతవీధి, యలమంచిలి గ్రామం, పోస్టు, మండలం, విశాఖపట్నం జిల్లా.
3. పట్నాల హైమావతి D/o. లేటు అప్పారావు, W/o.శంకరాచారి హిందూ, - Rest Do-

పై నెంబరు అమలులో జె.డి.ఆర్.లకు చాలామార్లు O.21,R-52 ప్రకారం ఎన్నిమార్లు నోటీసులు పంపినను పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నారు. కాబట్టి సదరు జె.డి.ఆర్.లకు వాయిదా రోజున అనగా **తే:17-04-2025 దీన ఉదయం 10.30 గం||లకు** శ్రీకోర్టుకు హాజరయి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వులపై)

యల్లపు నాగేశ్వరరావు
అడ్వకేటు, యలమంచిలి
సెల్: 9553383837

యలమంచిలి
తే:26-03-2025

హయ్యర్ పెన్షన్ వచ్చే వరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం నాయకులు

ప్రజాశక్తి- ములగాడ : హయ్యర్ పెన్షన్ వచ్చే వరకూ పోరాటం చేయాలని పెన్షనర్ల నాయకులు పిలుపునిచ్చారు. మల్కాపురంలోని సిఐటియు కార్యాలయంలో ఎపిఆర్‌పిఎ సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్.తమారావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ అమలుపరచటం ఆనందదాయకమని, అదే పద్ధతిన మిగిలిన పబ్లిక్ సెక్టార్ కంపెనీలకు కూడా అమలుచేయాలని కోరారు. కె.నూకరాజు మాట్లాడుతూ, కొన్ని సంఘాల వారు పెన్షన్‌పై పలు భ్రమలు కల్పిస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన ధర్నా, సెంట్రల్ పిఎఫ్ కమిషనర్‌తో జరిగిన చర్చలను, వివరించారు. షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, కోరమండల్, డిసిసిబి పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ వర్తించదు అనడం అన్యాయమని, దీనిపై పోరాటం చేయాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. హయ్యర్ పెన్షన్, షిప్‌యార్డు ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు రావలసిన 2శాతం బకాయిలపై ఎంపీ ఎం.శ్రీభరత్‌కు వినతి పత్రం అందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని కోరామని తెలిపారు.

చెద పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : చెద పురుగుల మందు తాగిన పాత సబ్బవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రంలోని పాత సబ్బవరం గ్రామానికి చెందిన ఎంద్ర అర్జున్ (42) పాత సబ్బవరం గొర్లివానిపాలెం గ్రామంలో గత పదిహేళ్లుగా కళాసీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7న అర్జున్ మద్యం సేవించి అనంతరం అలీమా టెస్ట్ అనే చెద పురుగుల మందును తాగేశాడు. ఇది గమనించిన కుటుంబ. సభ్యులు కేజీహెచ్‌కు తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించి ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటన్నర సమయంలో అర్జున్ మృతి చెందినట్లు మతుని భార్య రాము ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతునికి కుమారుడు వంశీ, కుమార్తె మేఘన ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీ అయ్యన్నకాలనీలో ఈ నెల 8న రాత్రి రుత్తల దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడు చిత్రాడ మహేష్‌ను అరెస్టు చేసినట్లు నర్సీపట్నం డిఎస్‌పి పీ.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో వెల్లడించిన వివరాలివి. ఈనెల 8న రాత్రి అయ్యన్నకాలనీలో తలుపులమ్మ తల్లి పండుగ సందర్భంగా రాత్రి స్టేజీ ప్రోగ్రాం ముందు డ్యాన్స్ చేస్తున్న రుత్తల దుర్గాప్రసాద్ తన స్నేహితుడు సాయి, భార్గవ్‌లతో ముద్దాయి చిత్రాడ మహేష్ గొడవపడ్డారన్నారు. ఎ రాత్రి 11 గంటల సమయంలో పండగ బందోబస్తులోఉన్న పోలీసులు సర్దిచెప్పి పంపించేశారన్నారు. అయితే నిందితుడు చిత్రాడ మహేష్ గొడవను మనసులో పెట్టుకొని రాత్రి ఒంటి గంట సమయంలో దుర్గాప్రసాద్ అన్నయ్య ఇంటి వద్ద వెళ్లి దుర్గాప్రసాద్ తన స్నేహితులతో ఉండగా రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించి, వెంట తెచ్చుకున్న చాకుతో దుర్గాప్రసాద్‌ను మూడు సార్లు పొడిచాడు. అడ్డుకున్న స్నేహితులు షణ్ముక,సాయిలపై దాడి చేసి గాయపరిచి పారిపోయాడు. గాయపడిన దుర్గాప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన చాకును స్వాధీనంచేసుకున్నామన్నారు. నిందితుడు చిత్రాడ మహేష్‌పై నర్సీపట్నం టౌన్‌లో పాత కేసు ఉన్నందున, . అతనిపై రౌడీషీట్ కూడా తెరుస్తామనానరు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి చైతన్య, టౌన్ సీఐ గోవిందరావు పాల్గొన్నారు.

కోరాడ నాగభూషణరావు ఆత్మహత్య

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : ఆనందపురం మండల టిడిపి మాజీ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు (65) గురువారం తెల్లవారు జామున ఆరిలోవ హెల్త్‌సిటీలోని ఒక ప్రయివేటు ఆసుపత్రి భవనం నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు కథనం ప్రకారం... ఆనందపురం మండలం, వేములవలస గ్రామానికి చెందిన నాగభూషణరావు గుండె సంబంధిత వ్యాధితో ఈ నెల 8వ తేదీన ఆరిలోవ హెల్త్ సిటీలోని ప్రయివేటు ఆసుపత్రిలో చేరారు. గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో తన వద్ద అటెండర్‌గా ఉన్న వ్యక్తిని కాఫీ తెమ్మని బయటకు పంపించారు. ఆసుపత్రి భవనం నాలుగో అంతస్తులో ఉన్న నాగభూషణరావు యుపిసి కిటికీని తెరచి అక్కడ నుంచి దూకేసారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఆసుపత్రి యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నాగభూషణరావు కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాగభూషణరావు తల్లి ఇటీవల మరణించడం, అనారోగ్య సమస్యల కారణంగా మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

శోకసముద్రంలో అభిమానులు

ఆనందపురం : కోరాడ నాగభూషణరావు (62) ఆత్మహత్యతో కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నాగభూషణరావు సుమారు 30 ఏళ్లపాటు ప్రజా సేవలో ఉన్నారు. అప్పలస్వామి, నర్సమ్మ దంపతులకు 3వ సంతానంగా కోరాడ నాగభూషణరావు జన్మించారు. 2001 నుంచి 2006 వరకు వేములవలస సర్పంచ్‌గా, 2013 నుంచి 2018 వరకు తెలుగుదేశం మండల పార్టీ ప్రెసిడెంట్‌గా, 2017 నుంచి 2019 వరకు భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.భీమిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి తిరుగు లేని నాయకుడిగా, సౌమ్యుడిగా, ప్రజాసేవకుడిగా మంచి గుర్తింపు పొందారు. ఎన్నో సందర్భాలలో చంద్రబాబు ఆశీస్సులు పొందారు.

పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మృతదేహాన్ని వేములవలస కూడలిలో ఊరేగించి అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవలస కూడలిలో షాపులను స్వచ్ఛందంగా మూసివేసి ఆయనకు నివాళులర్పించారు.

ఆత్మహత్యపై అనుమానాలు

నాగభూషణరావు ఆత్మహత్యకు అనారోగ్య సమస్యలే కారణమా లేక ఇంకే ఇతర సమస్యలేమైనా ఉన్నాయా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

నివాళులర్పించిన గంటా

కోరాడ నాగభూషణం పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 2014 ఎన్నికల్లో టిడిపి బలోపేతానికి నాగభూషణం ఎంతో కష్టపడ్డారని, ఆయన మరణం ప్రజలకు తీరని లోటని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన భౌతిక దేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంటా

పాఠశాలలను సందర్శించిన ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-మధురవాడ : గొల్లలపాలెం పాఠశాలలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. రెండు పాఠశాలల్లోనూ ప్రాథమిక పాఠశాల అడ్మిషన్ల తీసుకోవడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొందని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గొల్లలపాలెం పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. గొల్లలపాలెం పాఠశాల భవనం ముందు శిథిలావస్థలో ఉన్న తుపాను షెల్టర్‌ను తొలగించాలని అధికారులను ఆదేశించారు.

రైతు బజార్ స్థల పరిశీలన

ఎండాడలో రైతు బజార్ ఏర్పాటుకు అనువుగా ఉన్న ప్రాంతాలను ఎమ్మెల్యే గంటా పరిశీలించారు. సుభాష్ నగర్‌లోని ఖాళీ స్థలంతో పాటు పార్కు స్థలాన్ని కూడా చూశారు. రైతుబజార్ ఏర్పాటుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రయత్నాలు వేగవంతం చేశారు. స్థలం ఎంపిక పూర్తయిన తర్వాత సాధ్యమైనంత త్వరగా రైతుబజార్ అందుబాటులోకి తీసుకొస్తామని గంటా శ్రీనివాసరావు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం

ఎండాడ రాజీవ్‌నగర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యం నిర్వహణ పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్రెయిన్లలో నిలిచిపోయిన మురుగు గురించి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు చెప్పగా సంబంధిత సిబ్బందిపై ఎమ్మెల్యే మండిపడ్డారు. మురుగు ఎలా నిలిచిపోయిందో చూడకుండా కళ్లు మూసుకుపోయాయా అని తీవ్ర స్వరంతో శానిటరీ ఉద్యోగిని మందలించారు. అనంతరం తాగునీటి సరఫరా సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నీటి ఎద్దడి మరీ ఎక్కువగా ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చెట్టిపల్లి గోపీ, శాఖారి శ్రీనివాస్, సారిపల్లి శ్రీను, లొడగల రామ్మోహన్, మంగాదేవి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : కుటుంబానికి దూరంగా ఉండడం, కుటుంబ సమస్యలు కారణంగా హైదారాబాద్ ఉప్పల్ నవశక్తి నగర్‌కు చెందిన ఎస్.రఘురాం (52) భీమిలి బీచ్ తీరంలో ఈ నెల 9వ తేదీన పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లి అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు కెజిహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారుజామున 2 గంటలకు ఆయన మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

స్వతంత్రనగర్ రోడ్డులో మృతదేహం

ప్రజాశక్తి -గాజువాక : స్వతంత్ర నగర్ సర్వీస్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలూ దొరకకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా గాజువాక సిఐ కేసు నమోదుచేశారు. ఎవరైనా గుర్తుపడితే గాజువాక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : చోరీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు గాజువాక క్రైమ్ ఎస్ఐ మన్మథరావు తెలిపారు. అక్కయ్యపాలేనికి చెందిన ఏర్ల వినయ్‌కుమార్, కొబ్బరితోటకు చెందిన కిల్లి తరుణ్‌కుమార్, సీకు కిషోర్ కలిసి గత నెల 28వ తేదీన ఒక మహిళ మెడలో బంగారం పుస్తెలతాడును తస్కరించారు. నిందితులను గాజువాక క్రైమ్ పోలీసులు గురువారం ఆటోనగర్‌లో పట్టుకున్నారు. వారి నుంచి రూ.1500, పల్సర్ బైకును స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు గురై ఈ విధమైన చోరీలు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తల్లీకుమార్తెపై దాడి

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీకూతురుపై కత్తితో దాడిచేసిన ఘటనపై కేసు నమోదైంది. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... గాజువాక ప్రాంతానికి చెందిన బాలుడు, అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన బాలిక ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ అక్కయ్యపాలెంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. బాలికకు వేరొకరితో వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బాలుడు బుధవారం అర్ధరాత్రి అక్కయ్యపాలెంలో ఉంటున్న బాలిక ఇంటికి వచ్చాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో బాలిక తల్లిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఆమె మెడ, చేతులపై తీవ్రంగా గాయాలయ్యాయి. అనంతరం బాలిక మెడపై చేతులతో గట్టిగా నొక్కేశాడు. తల్లీకూతురు అరుపులు విని స్థానికులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. కత్తిని స్వాధీనం చేసుకున్నారు. బాధితులను చికిత్సను నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాపిడో డ్రైవర్‌పై దాడి : నగదు దోపిడీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, గాజువాక

స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధి కణితి శ్మశాన వాటిక సమీపంలో ర్యాపిడో డ్రైవర్‌పై దాడి చేసి నగదు దోపిడీ చేసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వసుధా ఫార్మాలో కిశోర్‌కుమార్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయంలో ర్యాపిడో వాహనం నడుపుతుంటాడు. బుధవారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి మధ్యాహ్నం ర్యాపిడో బుకింగ్ కోసం ఎదురుచూస్తున్నాడు. శ్రీనగర్ పెట్రోల్ బంక్ వద్ద బోలిశెట్టి సాయి మణికంఠ ర్యాపిడోను బుక్ చేసుకున్నాడు. స్టీల్ ప్లాంట్‌లో డ్రాప్ చేయాలని చెప్పాడు. ఆయన చెప్పిన విధంగా కిశోర్‌కుమార్ స్టీల్‌ప్లాంట్‌కు తీసుకెళ్తుండగా కణితి శ్మశాన వాటిక వద్ద వాహనం ఆపమని సాయి మణికంఠ కోరాడు. దిగిన వెంటనే ర్యాపిడో డ్రైవర్ కిషోర్‌కుమార్‌పై సాయిమణికంఠ దాడిచేశాడు. గాయపరిచి అతని మొబైల్ నుంచి రూ.48,100 వేరే వ్యక్తికి ఫోన్ పే చేయించుకొని వెళ్లిపోయాడు. గాయాల పాలైన కిషోర్‌కుమార్ సోదరుడి సాయంతో అగనంపూడి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. గురువారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ కేసును గాజువాక క్రైమ్‌కు బదిలీ చేయడంతో ఫోన్ లొకేషన్ ఆధారంగా నిందితుడ్ని గాజువాకలో క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితునిపై గతంలో రెండు కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

'పోర్టు' దీక్షలకు మెడికల్ రిప్రజెంటేటివ్‌ల మద్దతు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని కార్మికులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలను ఆంధ్రప్రదేశ్ మెడికల్ రిప్రజెంటేటివ్ నాయకులు శ్రీకాంత్ గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 40 వేల మంది ఆరోగ్యాలను వ్యాపారం చేయాలని మోడీ ప్రభుత్వం చేసిన ఆలోచన విరమించుకోవాలని కోరారు. వ్యాపారం అంటే లాభాలే పరమావధిగా ఉంటాయని తెలిపారు. పోర్టు స్టేడియం స్థలాన్ని ప్రయివేటుకు ఇవ్వడంతో స్విమ్మింగ్ పూల్‌లో బాలుడు మృతిచెందిన ఘటనను గుర్తుచేశారు. హాస్పిటల్‌ను ప్రయివేటుకు అప్పగిస్తే ఎంతమంది చావులు చూడాల్సి వస్తుందోనని ఆందోళన చెందారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని, పోర్టు సొంత నిధులతోనే నడపాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోరాటానికి సంఘీభావ కార్యక్రమాలు చేస్తామన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి కామేశ్వరరావు కూడా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, సిహెచ్.త్రినాధరావు, బి.జగన్, జక్కన సత్యనారాయణ నాయుడు, కెఎస్.కుమార్ పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మెడికల్ రిప్రజెంటేటివ్‌లు

గంగవరంలో క్రీడలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి -గాజువాక : క్రీడలు నిర్వహించడంలో గంగవరం గ్రామం ఎప్పుడు ముందుంటుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జిబిఎస్ స్పోర్ట్స్ యూత్ వార్షికోత్సవం సందర్భంగా ప్రో కబడ్డీ పోటీల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, గంగవరంలో గత 27ఏళ్లుగా జిబిఎస్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28వ వార్షికోత్సవం సందర్భంగా గంగవరంలో ప్రో కబడ్డీ పోటీలు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. క్రీడాకారులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెఎస్‌వి.ప్రసాద్‌రెడ్డి, లక్ష్మణరావు, మాడుగుల, పైడిరాజు, కోలా దుర్గారావు, దేముడు, కనకరాజు, ధనరాజు, పోలయ్య, మాధవ్, దేముడు, పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అగనంపూడి టిడిపి నాయకులు గురువారం గాజువాకలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కళాశాలలో బైపిసి గ్రూపు పెట్టాలని, ఒకేషనల్ కోర్సుకు అధ్యాపకులను నియమించాలని కోరారు. పర్మినెంట్ ప్రిన్సిపల్‌ను నియమించాలని, సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో సిఎస్ఆర్ నిధులతో సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, గొల్లవిల్లి వెంకటరావు, బండారు చందురమేష్ పాల్గొన్నారు.

ఘనంగా దివాకర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు అధ్యక్షులు గంట్ల దివాకర్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిపిఆర్ యంగ్ స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, కీర్తిశేషులు గంట్ల పెంటారావు ఈ గ్రామానికి ఎనలేని కృషిచేశారని, ఆయన పేరు ప్రఖ్యాతలను నిలబెట్టాలని సూచించారు. రాజకీయాల్లోకి యువనేతలు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బండారు అప్పలనాయుడు, టిడిపి నాయకులు మౌర్య సింహ, 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, దాట్ల మధు, పిన్నింటి పార్వతి, సరిపల్లి సర్పంచ్ గొర్ల రామకృష్ణ, కారక దేవుడు, ముక్కు రవిసుందర్, శెట్టి అప్పారావు, సాలాపు రమణ, శ్రీనుయాదవ్ పాల్గొన్నారు

పోషకాహారంపై శ్రద్ధ

ప్రజాశక్తి - ఆనందపురం: గర్భిణులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసిడిఎస్ పిఒ ఎం.శ్రీదేవి సూచించారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషకాహార పక్ష వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణులు పిల్లలు పుట్టిన రెండేళ్ల వరకు పోషకాహారం తీసుకునే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, విటమిన్ టాబ్లెట్లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రేఖావాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సహనాజ్ సాదియా, సిహెచ్‌ఒ శ్రీను, కృష్ణమోహన్, అంగన్‌వాడీ కార్యకర్త కాసులమ్మ పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ఫర్నీచర్

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యాన చిప్పాడలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రూ.90 వేలు విలువైన ఫర్నిచర్‌ను గురువారం సమకూర్చారు. ఔషధాలు భద్రపరిచే బీరువా ఐరన్ సేఫ్, పేషంట్లకు బెడ్, రోగులు కూర్చునేందుకు మూడు సీట్లతో కూడిన కుర్చీలు సమకూర్చారు. ఈ సందర్భంగా సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ, విలేజ్ హెల్త్ క్లినిక్‌కు వచ్చే వారికోసం మౌలిక వసతులు సమకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంపాడ రమావతి, ఎంపిటిసి సరగడ అప్పారావు, ఎ.శ్రీనివాస్, కె.నరసింహారావు పాల్గొన్నారు.

నేడు పల్లెకు పోదాం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని అనంతవరం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రూపాకుల రవికుమార్ తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యులు జివిఎల్ నరసింహారావు పాల్గొంటారని పేర్కొన్నారు.

వీధి కుక్కల నివారణకు ఐద్వా వినతి


వినతిపత్రం అందజేస్తున్న సత్యవతి తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : శీలానగర్‌లో వీధి కుక్కల సమస్యను నివారించాలని కోరుతూ ఐద్వా, శీలానగర్ అవేకెనింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన జోనల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందని, వీధుల్లో గుంపులుగా తిరుగుతూ పాదచారులను కరవటం, చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయని, ద్విచక్ర వాహనాల వెంటపడుతున్నాయని వివరించారు. వీధి కుక్కలతో స్కూలుకు వెళ్లే పిల్లల తల్లిదండ్రులు భయపడుతున్నారని తెలిపారు. కాలనీవాసులు, సీనియర్ సిటిజనులు భయపడి వాకింగ్ కూడా వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. వాటి అరుపులతో రాత్రిపూట నిద్ర ఉండటం లేదని తెలిపారు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జోనల్ కమిషనర్ శేషాద్రిని కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, జి.మణి, వందన, విన్నీ, ఆదిలక్ష్మి, అసోసియేషన్ నాయకులు పిఎస్ఎన్.రాజు, ఎన్.సత్యారావు, ఎన్‌వి.రావు, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు ఉన్నారు.

పురుషుల్లో వణుకుడు వ్యాధి

ప్రజాశక్తి -గాజువాక : పురుషుల్లో ఎక్కువగా వణుకుడు వ్యాధి వస్తుందని శీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్.విజయ్ తెలిపారు. ఇది కేంద్ర నాడీవ్యవస్థ, శరీర కదలికలను నియంత్రించే మెదడు సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. శరీర భాగాలను నియంత్రించే మెదడులోని ఒక భాగంలో ఉన్న డోపమైన్ ఉత్పత్తి చేసే న్యూరాన్‌లపై ఈ వ్యాధి దాడి చేస్తుందని తెలిపారు. ఇది వచ్చిన వారిలో చేతులు, కాళ్లు, తల వణుకుతాయని, నడక నెమ్మదిస్తుందని, మాట నిదానమవుతుందని, కండరాలు బిగుసుకుపోతాయని, క్రమంగా మతిమరుపు, నిద్ర సమస్యలు, కుంగుబాటు కమ్ముకొస్తాయని వివరించారు. ఈ ప్రమాదకర లక్షణాలన్నీ పార్కిన్‌సన్ వ్యాధి అని తెలిపారు. దాదాపు 60 ఏళ్ల వయసు పైబడిన వారిలో ఈ వ్యాధి కనిపిస్తుందని పేర్కొన్నారు.



పార్కిన్‌సన్ లక్షణాలు ప్రారంభదశలో కనిపించవని, 80 శాతం న్యూరాన్‌లు దెబ్బతిన్న తర్వాతనే వ్యాధి నిర్ధారణ జరుగుతుందని తెలిపారు. లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించి, వారి సూచన మేరకు మందులు తీసుకుంటూ, వ్యాయామం చేస్తూ సరైన ఆహారం తీసుకోవాలని తెలిపారు.

రజకులకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రజకులకు ప్రభుత్వం రుణాలిచ్చి వృత్తికి సహకారం అందించాలని సిపిఎం జిల్లా నాయకులు యుఎస్ఎన్.రాజు కోరారు. సీతంపేట పబ్లిక్ లైబ్రరీ ప్రాంతంలో రజకవృత్తిదారులు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాలకు సంక్షేమ పథకాలను అందించడంలో లోపం ఉందన్నారు. రజకులు దోబీలు నిర్మించుకోవడానికి నిధులు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రజక వృత్తిదారులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభల బ్రోచర్‌ను విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులు ప్రజాపక్షం వహించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : కళాకారుడు ప్రజాపక్షం వహించాలనే నిబద్ధత కానూరి గళంలో కనిపిస్తుందని ప్రముఖ కవి, గాయకులు సిరికి స్వామినాయుడు అన్నారు. ప్రజాకవి, గాయకులు కానూరి పదో వర్ధంతి సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పౌర గ్రంథాలయంలో సాహిత్య సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్వామినాయుడు మాట్లాడుతూ, సాంస్కృతికోద్యమ కేతనం, విప్లవోద్యమాల చైతన్య దీప్తి కానూరి వెంకటేశ్వరరావు అన్నారు. కాలం కరిగిపోతున్నా వీరగాథలు పాడి ఉద్యమానికి ఊపిరిలూదిన కానూరి గళం వెన్నంటే ఉందన్నారు. ప్రజాకళలకు పురుడుపోసి అరుణోదయాన్ని భావితరాలకు అందించిన ఆయన స్ఫూర్తి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలోని ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగ మూలాలపై దాడి చేస్తూ ఒకే దేశం ఒకే చట్టం పేరుతో వివిధ జాతుల మతాల ఆచార సంప్రదాయాలను నాశనం చేస్తుందన్నారు. అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల అధ్యక్షత జరిగిన సభలో ఏడుకొండలు, కొండయ్య, ఐఎఫ్‌టియు నాయకులు కె.వెంకటేశ్వర్లు, భారత నాస్తిక సమాజం కన్వీనర్ సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- గాజువాక : అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా శీలానగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప జీవితచరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శబరి విద్యానికేతన్, అక్కిరెడ్డిపాలెం, మిండి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో నంబారు రాజు, బొడ్డు చిన్నప్పలస్వామి, మరదాని శ్రీనివాసరావు, జక్క కొండలరావు, చరపాక నాగార్జునరాజు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులపై శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక గొల్లలపాలెం కెజిబివి 9, 10, ఇంటర్ విద్యార్థినులకు ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ కోర్సులో భాగంగా కృష్ణా కాలనీలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిసిడిఒ డాక్టర్ కలిషా బేగం, సమగ్ర శిక్ష రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎస్.రిషి, ప్రిన్సిపల్ గంగాకుమారి తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌ను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-మధురవాడ : రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ పునరుద్ధరణ నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ బ్లూ ఫ్లాగ్ సంస్థ సందర్శకులకు అందించబోయే వసతులపై ఆరా తీశారు. ప్రపంచ సందర్శకులను ఆకర్షించేలా రుషికొండ బీచ్‌ను తీర్చిదిద్దనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జగనన్న కాలనీలో దాహం కేకలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని బాందేవపురం పంచాయతీ పరిధి విజయరాంపురం జగనన్న కాలనీలో నాలుగు రోజులుగా దాహం కేకలు జోరుగా వినిపిస్తున్నాయి. పల్లికొండ సమీపంలో బోర్ ఉన్న మోటారు కాలిపోవడంతో కొత్తగా ఏర్పాటుచేసిన ఈ కాలనీ వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు విషయం తెలియజేసినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామ సర్పంచ్‌కు కూడా ఫిర్యాదు చేశారు. నిధులు లేక మరమ్మతులు చేయలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ వాసులకు తాగునీరు అందించాలని కోరుతున్నారు.

దొడ్డి రామునాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

సిపిఎం ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ దొడ్డి రామునాయుడు 42వ వర్ధంతి కార్యక్రమం స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. దొడ్డి రామునాయుడు చిత్ర పటానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ నాడు పుచ్చలపల్లి సుందరయ్య ప్రోద్భలంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో సిపిఎం విస్తరణకు దొడ్డి రామునాయుడు విశేషమైన కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన తుదిశ్వాస వరకూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం పరితపించారన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి నిరుపేదగా జీవితాన్ని గడుపుతూనే కేన్సర్ వ్యాధికి గురయ్యారని తెలిపారు. అయినా ఎక్కడా వాటిని పట్టించుకోకుండా సిపిఎంను విశాఖ జిల్లాలోనే కాకుండా అనకాపల్లి గ్రామీణ ప్రాంతంలో విస్తరించడంలో అమోఘమైన సేవలందించారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి నివాసం వుంటున్న తన ఇంటిపైనే విద్యార్థులకు ట్యూషన్ సెంటర్లను నిర్వహించారని చెప్పారు. విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడంలో భాగంగా కామ్రేడ్ ఎ.బాలకృష్ణ, మళ్ళ సత్యన్నారాయణ లాంటి నేతలను తయారు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, కె. తేలయ్యబాబు, నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



దొడ్డి రామునాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం

ప్రజాశక్తి-అనకాపల్లి : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2025 జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. అనకాపల్లిలో మూడు కేంద్రాల్లో మూల్యాంకనం (వాల్యూయేషన్) ప్రక్రియ జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి, డిప్యూటీ డిఇఒ, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షలు, జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారుల సహకారంతో నిర్వహించినట్లు చెప్పారు. అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు నిరంతర, నిర్విరామ మూల్యాంకన నిర్వహణ చిత్తశుద్ధితో చేశారన్నారు. స్ట్రాంగ్ రూమ్ సిబ్బంది, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ సిబ్బంది, విద్యుత్, తపాలా శాఖ సిబ్బంది అందించిన సేవల సహకారంతో ఈ నెల 3 నుండి 10వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ దిగ్విజయంగా సకాలంలో పూర్తి చేసినట్లు చెప్పారు.

పెంచిన ఆస్తి పన్నును రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణాల్లో పెంచిన ఆస్తి (ఇంటి) పన్నును తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటన డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో సతమతమౌతున్న ప్రజలపై ఆస్తి పన్ను పెంచి వారిపై పెనుభారం మోపడం అన్యాయమన్నారు. 2025-26కు సంబంధించి పట్టణాల్లో ఆస్తిపన్ను గత సంవత్సరంతో పోలిస్తే 15 శాతం, 2020-21తో పోల్చితే 30 శాతం పన్ను పెంచుతూ గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని పేర్కొన్నారు. దీని ఫలితంగా రూ.320 కోట్ల భారం ప్రజలపై పడుతుందన్నారు. ఎన్నికల్లో కూటమి పార్టీలు ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులు పెంచబోమని చెప్పి ఇప్పుడు ఇంటి పన్నులు పెంచడం దారుణమన్నారు. ఆదానీ పోర్టులు, పరిశ్రమలు, ఇతర కార్పొరేట్ కంపెనీలకు పూర్తిగా ఆస్తి పన్ను ప్రభుత్వం రద్దు చేస్తుందని, కొత్తగా పెట్టే పరిశ్రమలకు అనేక సంవత్సరాలపాటు పన్ను రాయితీలు ఇస్తున్నారని, పేద, మధ్యతరగతి ప్రజలకు మాత్రం పన్నులు తగ్గించకపోగా, పెంచడం దుర్మార్గమన్నారు, పెంచిన పన్నుకు వ్యతిరేకంగా పట్టణ ప్రజలు సంఘటితంగా ప్రతిఘటించాలని సిపిఎం నేత కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ఎఐ, డేటా సైన్స్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి : డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ విద్యార్థుల ఫేర్వెల్ పార్టీ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినారు. చివరి సంవత్సర విద్యార్థులకు తమ జూనియర్స్ అందరూ షీల్డులను బహుకరించి తమ ఆనందాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఎం విభాగాధిపతి డాక్టర్ ఏ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, అకాడమిక్ డీన్ కృష్ణ నాగ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయ విధానంలో మగ్గబెట్టిన మామిడి పండ్లను మాత్రమే విక్రయించాలి : జెసి

ప్రజాశక్తి-అనకాపల్లి : సాంప్రదాయ, సురక్షిత విధానంలో మగ్గబెట్టిన మామిడిపండ్లను మాత్రమే విక్రయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. జిల్లాలో 12500 మంది రైతులు 20 వేల ఎకరాలలో మామిడి పంటను సాగుచేస్తున్నారని, సుమారు 50 వేల మెట్రిక్ టన్నులు పంటను ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. ఉద్యానశాఖ అధికారులు పండ్లను మగ్గబెట్టే సురక్షిత విధానాలపై రైతులకు, వ్యాపారులకు తెలియజేయాలని సూచించారు. సబ్బవరం మండలం పినగాడి వద్దగల రయిపెనింగు ఛాంబర్లను వినియోగించుకొనే విధంగా ప్రచారం చేయాలన్నారు. ప్రజలకు హాని కలిగించే కాల్షియమ్ కార్బైడ్ ఉపయోగించి పండ్లు మగ్గబెట్టే విధానాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు. ఆహార భద్రతా శాఖ సిబ్బంది అధికంగా శాంపిల్స్ సేకరించాలని, కార్బైడ్ వాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ, మునిసిపల్ సిబ్బంది దీనిపై అవగాహన కల్పించాలన్నారు. నర్సీపట్నం, పాయకరావుపేట మార్కెట్ యార్డులు, విశాఖపట్నం రైతుబజార్లలో గల రయిపెనింగు చాంబర్లను వెంటనే వినియోగంలోనికి తీసుకురావాలని మార్కెటింగు శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలి



ఊడేరులో క్వారీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శ్రీరామ్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార శాఖ యూనియన్ చైర్మన్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం ఊడేరు గ్రామం సర్వే నెంబర్ 211 జగదాంబ క్వారీ యాజమాన్యం అక్రమంగా మట్టితో కరెంటు పోల్స్‌ను కరెంట్ వైర్లు ఉన్నంత మేరకు మట్టితో కప్పి వేయడంతో గురువారం మేతకి వెళ్ళిన మేకలకు వైర్లు తగిలి మృతి చెందడంతో ఆ సంఘటనా స్థలాన్ని గంటా శ్రీరామ్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో క్వారీల యజమానుల ఆగడాలు రోజు రోజుకీ మితిమీరిపోతున్నాయని, మనుషులు, జీవాలు చనిపోయిన నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని పేర్కొన్నారు. జగదాంబ క్వారీ యాజమాన్యం పట్ల మైనింగ్, పోలీస్, రెవిన్యూ, ఎలక్ట్రిసిటీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో కొండలను కబ్జా చేసి, అక్రమంగా కరెంటు లైన్స్‌ని కూడా ఆక్రమించడంతో ఇటువంటి ప్రమాదం జరిగిందని తెలిపారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకుంటే కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాళ్ళ తెలయ్యబాబు, సొసైటీ అధ్యక్షులు జమ్మి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



బుచ్చయ్యపేటలోయ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాలలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులు, పిడుగుల శబ్దం, వడగల్లుతో కూడిన భారీ వర్షం దంచి కొట్టింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎండ వేడితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు వాతావరణం చల్లబడడంతో ఉపశమనం లభించింది. అపరాలు, చెరకు తదితర పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు తెలిపారు. వర్షం నీటితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

యలమంచిలి : యలమంచిలిలో గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల వరకు 14.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఇన్‌ఛార్జి అసిస్టెంట్ స్టేటిస్టిక్స్ అధికారి సునీతాదేవి తెలిపారు. ఉక్కపోత, వేడిమితో అల్లాడే ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. ఈ వర్షం పూత దశలోను, కాయకట్టే దశలో ఉన్న నువ్వు పంటకు నూరుశాతం మంచి చేస్తుందని, దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి పాలిమేర మోహనరావు తెలిపారు. గాలులకు రామనగర్ సమీపంలోని పోలవరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ ఆఫీసు తోటలో చెట్టు కొమ్మ విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సకాలంలో విద్యుత్ శాఖ అప్రమత్తమై విద్యుత్‌ను పునరుద్ధరించారు.

అచ్యుతాపురం : మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల నువ్వు చేనుకు నష్టం వాటిల్లుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. రెండు మూడు రోజులుగా చెదురు మదురుగా తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. పది గ్రామాల్లో సుమారు ఐదు వందల ఎకరాల విస్తీర్ణంలో నువ్వు పంటను నాటారు. ఈ నెల ప్రారంభం నుంచి పండిన పంటను కోత కోసి కుప్పలుగా పెడుతున్నారు. మరొక పదిహేను రోజులలో మిగిలిన నువ్వు పంటను కోయడానికి రైతులు ఆశతో ఉన్నారు. ఈలోగ వర్షం గాలులు వేయటంతో పంట దెబ్బతింటుందని రైతులు తెలిపారు.

జగన్ శవ రాజకీయాలు మానుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి శవ రాజకీయాలకు మానుకోవాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు గురువారం ప్రకటనలో హితవుపలికారు. తమ వైసీపీ కార్యకర్తను చంపారనే నినాదంతో రోడ్డెక్కేస్తారని, ఆయా కుటుంబాలకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇచ్చే సందర్భాలు లేవని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా పోలీసులను బట్టలు ఊడదీస్తామని మాట్లాడటం సరికాదన్నారు. గత ఐదేళ్లలో తాను చేసిన అరాచక పాలన మరిచిపోయారా అని ప్రశ్నించారు.

ఫ్లై ఓవర్ వద్దు.. రింగ్ రోడ్డు నిర్మించండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించవద్దని, రింగురోడ్డు వేయాలని రోడ్డు విస్తరణ బాధితులు అనకాపల్లి ఆర్డీవోకు వద్ద గోడు వినిపించారు. అచ్యుతాపురంలో గురువారం రోడ్డు విస్తరణ నిర్వాసితుల ఎదుర్కొంటున్న సమస్యలపై అనకాపల్లి ఆర్డీవో ఆయేషా అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో రోడ్డు విస్తరణ నిర్వాసితుల సంఘ కన్వీనర్ ఆర్.రాము, పల్లి శేషగిరిరావు, దేశంశెట్టి అప్పలనాయుడు, భవిరిశెట్టి అప్పారావు, రాజాన సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు

భవిత కేంద్రానికి పలు వస్తువుల వితరణ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ భవిత కేంద్రంలో వికలాంగులకు పిఫై నాయుడు అండ్ కో కంపెనీ తరుపున రూ.25 వేలు విలువైన వస్తువులను గురువారం అందజేశారు. భవిత స్కూల్‌కు ప్రింటర్, ఫిజియోథెరపీ మెటీరియల్, వికలాంగులకు హెల్త్ స్నాక్స్ సమకూర్చగా, వాటిని ఎంపిపి పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరిపరపు అప్పలనాయుడు, చేతుల మీదుగా భవిత ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ సాయిశైలజ, నాయకులు పైలా రామచంద్రరావు, టి.వెంకట్రావు, రెడ్డి శ్రీనివాసరావు, సిహెచ్ కనకారావు, వార్డ్ మెంబర్ పైలా హరీష్ రావు, భవిత ఉపాధ్యాయులు టి.కుమారి, రాంకీ హెచ్ఆర్ గిరిధర్ భక్తి, శ్రీకాంత్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బెల్టు షాపుల వేలం పాట అడ్డగింత

ప్రజాశక్తి-యలమంచిలి : మే నెలలో నిర్వహించనున్న పెద్దపల్లి హేమాంబిక అమ్మవారి పండగ నిమిత్తం గ్రామంలో ఒకే బెల్టు షాపు నిర్వహణ హక్కులు కోసం వేలం పాట నిర్వహించడానికి గ్రామస్తులు గురువారం ఉదయం సమాయత్తం కాగా, ఎక్సైజ్ పోలీసులు అడ్డుకున్నారు. వేలం సంగతి విశ్వసనీయంగా తెలియడంతో స్థానిక ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇ.సోమయ్య సిబ్బందితో పెదపల్లి గ్రామం చేరుకున్నారు. పెద్దలందరినీ పిలిచి పంచాయతీ పెట్టారు. హేమాంబిక అమ్మవారి పండగ నిర్వహణ గురించి మాత్రమే చర్చించామని, బెల్టు షాపుల విషయం ఏమీ చర్చించలేదని వివరించడంలో ఎక్సైజ్ సిబ్బంది వెనుతిరిగారు. గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు తలెత్తకుండా పెద్దలు సహకరించాలని కోరారు.

డిసిసి ఉపాధ్యక్షునిగా సత్యనారాయణ

ప్రజాశక్తి-వడ్డాది : అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా వడ్డాదికి చెందిన సయ్యపురెడ్డి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు మీసాల సుబ్బన్న ఆయనకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం వడ్డాదిలో సత్యనారాయణ స్థానిక విలేకరులతో మాట్లాడారు. తనకిచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిల, డిసిసి అధ్యక్షుడు మీసాల సుబ్బన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్ననాటి నుండి క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థులు చిన్ననాటి నుండే క్రమశిక్షణ అలవర్చుకుని సమాజంలో మంచి పౌరులుగా పేరు తెచ్చుకోవాలని ఎస్సై మణికుమారి తెలిపారు. మండలంలోని దిబ్బపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శక్తి టీంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, బాల్యవివాహాల వల్ల నష్టాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార అలవాట్లు, గుడ్ టచ్ బాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ పుష్పలత, శిరీష, హెచ్ఎం జి. ఉమామహేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక పంచాయతీ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న షెడ్డును తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీను తెలిపారు. కె.కోటపాడులో బజారు స్థలం ఎప్పటినుండో ఖాళీగా ఉంది. గతంలో ఈ స్థలంలో ప్రతిరోజు కూరగాయలు, మాంసం, చేపలు దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టేవారు. ఆ దుకాణాలకు పంచాయతీ నుండి ఆశీలు కూడా వసూలు చేసేవారు. కాలక్రమేణా కూరగాయలు దుకాణాలు మెయిన్ రోడ్డు వద్దకు చేరుకున్నాయి. అప్పటినుండి బజారు స్థలం ఖాళీగా ఉండిపోయింది. గ్రామానికి చెందిన పట్నాల రామచంద్రరావు అదే స్థలంలో వ్యాపారం నిమిత్తం ఒక షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి గురువారం తన సిబ్బందితో వెళ్లి నిర్మాణాన్ని తొలగించారు. ఇదిలా ఉండగా గ్రామంలో అనేక చోట్ల అక్రమ నిర్మాణాలు ఉన్నాయని వాటిని కూడా తొలగించాలని పట్నాల రామచంద్రరావు డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకాంబికి అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. గురువారం శివ కేశవులు అన్నమయ్య కోలాట సంస్థ ఎం.సుజాత, పి గౌరీ మల్యాపురం, వారి కీర్తనలు కోలాటాలు, చప్ప శివకుమార్ శిష్య బృందం విజయవాడ చిన్నారుల నృత్య గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పలు దేవస్థానాలకు చెందిన కటకం లక్ష్మణరావు, బిళ్లపాటి కృష్ణ కుమార్, దాడి రాజేశ్వరి, బొలిశెట్టి శ్రీనివాసరావు, అప్పికొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న ఫైజర్ ఇండియా హెడ్

అనకాపల్లి రూరల్ : నూకాంబిక అమ్మవారిని గురువారం ఫైజర్ ఇండియా రెగ్యులేటరీ హెడ్ కె.సూరిబాబు దంపతులు దర్శించుకొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదం అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ ఈవో వెంపల్లి రాంబాబు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి పాల్గొన్నారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : డిఎస్‌సి ఉచిత శిక్షణ కొరకు జిల్లాకు చెందిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఇబిసి అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి కె.రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెగా డిఎస్సి పరీక్ష కోసం ఉచిత ఆన్లైన్ కోచింగ్ తీసుకోవడానికి టెట్ అర్హత సాధించిన ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టెట్ పరీక్షలో అర్హత పత్రాలను జతపరచిన దరఖాస్తును తమ కార్యాలయం ఇంటినెంబర్ 10-06-31/7, రఘురామ కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజ్ స్ట్రీట్, అనకాపల్లి జిల్లాకు సమర్పించాలని కోరారు. దరఖాస్తుకు చివరితేదీ, ఆన్లైన్ కోచింగ్ ప్రారంభించు తేదీ, కోచింగ్ వ్యవధి వంటి వివరాలు త్వరలో తెలియజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9885845743, 9494978777 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : పోషకాలు వున్నా ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ బయ్యవరం సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.వంశీప్రియా అన్నారు. మండలంలోని ఏనుగుతుని గ్రామంలో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పలనాయుడు, మహిళా పోలీస్ వి.ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు కే.జగదీశ్వరి, ఆర్.కరుణ కుమారి, ఉపాధ్యాయులు భరత్ లక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అనకాపల్లి : చిన్ననాటి నుండే పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు ఇవ్వాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు లావణ్య పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురం అంగన్వాడి కేంద్రంలో పుట్టిన మొదటి 1000 రోజుల్లో ఎటువంటి పోషణ అందించాలి అనే అంశంపై గురువారం పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా లభిస్తున్న ఆకుకూరలు కూరగాయలు ఉపయోగించడం ద్వారా ఏ విధంగా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది కే రాము, యోగ టీచర్ ఎం చంద్రిక పాల్గొన్నారు.

12న విద్యుత్తు ఉద్యోగుల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయండి



సదస్సు పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-చోడవరం
విద్యుత్ రంగ ప్రైవేటీకరణ, పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 12న విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరుగు విద్యుత్ ఉద్యోగులు ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పిలుపునిచ్చారు. చోడవరంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గురువారం సదస్సు పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా పిఆర్‌సి ఇవ్వాలని, కనీసం డిఎ యాడ్ చెయ్యాలని, సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, రీజనల్ అధ్యక్షులు ప్రేమ్ చంద్రశేఖర్, ఎన్.అవతారం, టి.శేసు, టి.గణేష్ కుమార్, ఎం.మహేష్, సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, ఎస్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఈ నెల 12న విద్యుత్ ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయాలని గురువారం దేవరాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇపిడిసిఎల్ పరిధిలో ట్రాన్స్ కో, జెన్ కో, డిస్కంలలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కె.కోటపాడు : విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 12న ఉదయం 10 గంటలకు విశాఖ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరుగు సదస్సును జయప్రదం చేయాలని మండలంలోని వారాడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం అవతారం మాట్లాడుతూ విద్యుత్ రంగా ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ సంఘం స్థలం అమ్మకం సరికాదు

ప్రజాశక్తి-వద్దాది
బుచ్చియ్యపేట మండలం వద్దాది దొరబాబు కాలనీలో ఉపాధ్యాయ సంఘానికి కేటాయించిన గ్రామ కంఠం స్థలాన్ని అమ్మకం చేయడం సరికాదని ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, టిడిపి టౌన్ అధ్యక్షుడు దొండా నరేష్, జనసేన సీనియర్ నేత అడపా నరసింహమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు. సంబంధిత స్థలాన్ని గురువారం వారు పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం కార్యాలయం నిమిత్తం 1999లో సర్వేనెంబర్ 49లో 3 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కేటాయించి ఆ సంఘం పేరిట పట్టా మంజూరు చేసిందని తెలిపారు. ఆ స్థలాన్ని ఇటీవల స్థానికంగా ఓ ప్రైవేటు వ్యక్తికి ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు అమ్మకం చేపడుతున్నారని ఆరోపించారు. ఈ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మడం నిషేధమని, ఒకవేళ భవనం నిర్మించకపోతే ఆ స్థలాన్ని పంచాయితీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ స్థలాన్ని ఎవరైనా కొన్నా, అమ్మినా చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్.మాధవరావు, ఎస్ఎంసి చైర్మన్ కోవెల వెంకటరమణ, తలారి శంకర్, అక్కిరెడ్డి కనక, సూరిబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-రాంబిల్లి
మండలంలోని ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు 9 వారాల వేతన బకాయిలను చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడు నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని లోవపాలెంలో ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ మండుటెండలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు 9 వారాలుగా కూలి డబ్బులు చెల్లించకపోతే వారు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. పేస్లిప్‌లు ఇవ్వకపోవడంతో రోజుకు ఎంత వస్తుందో తెలియడం లేదన్నారు. కుటుంబానికి ప్రతి ఏటా 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎరిపెల్లి రాము, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ఉపాధి హామీ కూలీలకు నాలుగైదు నెలలుగా బకాయిలు ఉన్న కూలి డబ్బులు వెంటనే చెల్లించాలని సిపిఎం మండల నాయకులు ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఉపాధి కూలీలకు సుమారు రూ.4కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. పనిముట్లు, వేసవి అలవెన్స్ ఇవ్వాలని, మెడికల్ కిట్లు, టెంట్లు, మజ్జిగ, నీరు వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పప్పుల కోటేశ్వరరావు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో భోజన సౌకర్యం మెరుగుపర్చాలి



రోగులతో మాట్లాడుతున్న సిపిఎం, ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక 50 పడకల ఆసుపత్రిలో భోజన సౌకర్యం మెరుగుపర్చాలని, పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని, శానటరీ, సెక్యూరిటీ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండినాయనబాబు, సిఐటియు మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు, గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు గురువారం స్థానిక 50 పడకల ఆసుపత్రిని పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడారు. ప్రతి రోగికి రోజుకు రూ.100 ప్రభుత్వం ఇస్తుండగా, దీనికి సరిపడా నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, దీంతో రోగులు అత్యధిక మంది ఇంటి నుండి భోజనాలు తెచ్చుకుంటున్నారని తెలిపారు. కాని కాంట్రాక్టర్లు బిల్లులు చేసుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందని సిపిఎం నాయకులు తెలిపారు. చిన్న పిల్లలు, ఎముకలు, జనరల్ మెడిసిన్ వైద్యులు లేరని, దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పర్మినెంట్ స్టాఫ్ నర్సులు కొరత కూడా ఉందన్నారు. శానటరీ వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులకు మూడు నెలలు నుండి జీతాలు ఇవ్వలేదని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : కె.కోటపాడులో ఫీడరు మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి కె.కోటపాడు గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు.

అనకాపల్లి : 33/11 కెవి కసింకోట సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో ఉన్న కొత్తూరు, మూలపేట, సత్యనారాయణపురం, సంపతిపురం, వేటజంగాల పాలెం, కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, పిసినికాడ గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహరించాలని కోరారు.

చట్టాలు, సమాజంపై అవగాహన పెంచుకోవాలి


ప్రజాశక్తి-సబ్బవరం : న్యాయ విద్యార్థులు చట్టాలు, సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని ఏపి హైకోర్టు న్యాయమూర్తి విఆర్‌కె.కృపాసాగర్ అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో న్యాయవిద్య- న్యాయవాద వృత్తి అనే అంశం బుధవారం ఆయన ఉపన్యాసం చేశారు. ఒక సారి కోర్స్ పూర్తతే బయట ప్రపంచంలో మనలను పట్టించుకునే వారు ఉండరని, మనకు మనమే ఎదగాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ దగ్గరకు వచ్చిన ప్రతి కేసునూ అంగీకరించి వాదించగల జ్ఞానం కలిగి ఉండాలన్నారు. అందుకు విద్యార్థి దశలో అనేక చట్టాలను అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్ రుణాల్లో కూటమి ధర్మం పాటించలేదు'

ప్రజాశక్తి-వద్దాది : కార్పొరేషన్ రుణాల ఎంపికలో ప్రభుత్వ పెద్దలు కూటమి ధర్మం పాటించడం లేదని జనసేన సీనియర్ నేత అడపా నరసింహమూర్తి ఆరోపించారు. వద్దాదిలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఓసి కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికలో స్థానిక జనసేన నేతలకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ రుణాలు అనర్హులకు మంజూరు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జివిఎంసి 88వ వార్డులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, వైసిపి నాయకులు గండి రవి కుమార్, 88వ వార్డు ఇంచార్జ్ గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, దాడి నూకరాజు, వంగలపూడి గణేష్, పట్నాల లక్ష్మణరావు, ములకలపల్లి అప్పారావు, ఐడి.బాబు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలను ఆవిష్కరించిన అమర్‌నాథ్, అదీప్‌రాజ్ తదితరులు

రైతు గ్రూపులకు రాయితీపై డ్రోన్లు

ప్రజాశక్తి - రావికమతం : ఐదుగురు సభ్యులతో కూడిన రైతు గ్రూపులకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్‌ను అందజేస్తుందని మండల వ్యవసాయాధికారి రూప తెలిపారు. డ్రోన్ ధర రూ.పది లక్షలు కాగా ప్రభుత్వం రూ.8లక్షలు రాయితీ ఇస్తుందని, మిగిలిన మొత్తం రూ.2లక్షలు గ్రూపు సభ్యులు రైతువాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. తమ పేరిట భూమున్న ఐదుగురు రైతులు ముందుగా గ్రూపుగా ఏర్పడాలన్నారు. అయితే గ్రూపు సభ్యులు రూ. 5 లక్షలను గ్రూపు పేరిట బ్యాంకు రుణం తీసుకుని డ్రోన్ కంపెనీకి కట్టాలన్నారు. డ్రోన్ పరికరం వచ్చిన తర్వాత జాయింట్ ఇన్స్పెక్షన్ రిపోర్టు అందజేసిన తర్వాత గ్రూపు సభ్యులకు రూ.8 లక్షల ప్రభుత్వ సబ్సిడీ జూన్ మొదటివారంలో గ్రూపు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. గ్రూపు సభ్యుల సిబిల్ స్కోర్ బాగుండాలని, లేకుంటే సభ్యులను వెంటనే మార్చుకోవాలని ఎఒ సూచించారు.

సక్రమ మార్గంలో నడవాలి

- సిపి శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి -తగరపువలస : మనిషి జీవితం ఉన్నత మైనదని, దాన్ని సక్రమ మార్గంలో నడిపించుకోవాల్సిన అవసరం ఉందని విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం పలు అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మాదకద్రవ్యాలు తొలుత సరదాగా ప్రారంభమై తర్వాత వ్యసనంలా మారి తుదకు జీవితాన్నే నాశనం చేస్తాయని వివరించారు. చదువు, జీవితంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతాయన్నారు. సైబర్ నేరాలు జరిగే తీరు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళలపై వివిధ రూపాల్లో జరుగుతున్న హింసను వివరించారు. ప్రేమ విఫలమైందని, తల్లి దండ్రులు బైక్ కొనలేదని, అప్పులు ఉన్నాయని,

బూత్ స్థాయి అధికారుల శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న తహశీల్దార్ తిరుమలబాబు

ప్రజాశక్తి -కోటవురట్ల : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం బూత్ స్థాయి అధికారులతో తాహసిల్దార్ తిరుమల బాబు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు నిరంతరం గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు, నియోజవర్గం ఎన్నికల డిటి అన్నాజీ రావు మాట్లాడుతూ బూత్ స్థాయిలో 1200 ఓట్లు దాటిన గ్రామాలను గుర్తించామని, నియోజకవర్గంలో 12, ఇలాంటి గ్రామాలుండగా, కోటవురట్ల మండలంలో రెండు గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక బూత్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు ఫారం 6,7,8, దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సూచించారు,

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సంతోషి

ప్రజాశక్తి-కొత్తకోట : పౌష్టికా హారంతోనే సంపూర్ణ ఆరోగ్యమనికొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రజని, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సంతోషి అన్నారు. గురువారం 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు పురస్కరించుకొని కొత్తకోట పంచాయతీ పరిధిలో కొత్తకోట, మేడివాడ సెక్టార్ పరిధిలో జెడ్.బెన్నవరం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 22వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నా మన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. జెడ్. బెన్నవరం గ్రామంలో కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారి రజని మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుంచి శిశువుకు జన్మనిచ్చి వారికి రెండేళ్ల వయసు వచ్చేంత వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు వెయ్యి రోజుల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందించే పౌష్టికహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు...

పద్య పఠన విజేతలకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్‌లో అనంతచ్ఛందము, నానీస్ మహతీస్ ఛానల్ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న పద్యపఠనం పోటీలలోభాగంగా ఫిబ్రవరి నెల ఫలితాలలో ద్వితీయ, తృతీయ స్థానాలతో నిలిచిన విద్యార్థులకు గురువారం ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు చోడిశెట్టి సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్. ఆచార్యులు అందజేశారు పద్యగురు సార్వభౌమ, ఛందశ్శాస్త్ర రత్నాకర తోపెల్ల బాల సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో పద్యమేవ జయతే అనే నినాదంతో ప్రతి నెలా చివరి ఆదివారం ఈ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ముగ్గురు విద్యార్థులతో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు 17 మంది పద్యపఠనం పై ఆసక్తి కనబరచడం అభినందనీయమని హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫాల్గుణరావు, కుమారి, చిన్నారావు, శ్రీదేవి పాల్గొన్నారు.

15న రాజలింగేశ్వర స్వామి భూముల వేలం

ప్రజాశక్తి-కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట రాజలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములను మూడేళ్లు కౌలుకు సాగు చేసుకునేందుకు ఈనెల 15న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కెబి ఆశా కిరణ్మయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకోట రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 394లో 4.60 ఎకరాలు, సర్వే నెంబరు 401లో 0.38 ఎకరాల పల్లపు భూమిని 2028 మార్చి వరకు కౌలుకు ఇచ్చేందుకు ఈ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న ఉదయం కొత్తకోట దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించే ఈ పాటలో పాల్గొనే అభ్యర్థులు రూ వేయి ధరావత్తు చెల్లించాలని సూచించారు. అలాగే పాటలో పాల్గొనే ముందు రూ లక్ష రూపాయలు సాల్వెన్సీ సర్టిఫికెట్ అందజేయాలన్నారు. పాత బకాయిలు ఉన్నవారు, పోలీస్ కేసులో ఉన్నవారు ఈ పాటకు అనర్హులని తెలిపారు. హెచ్చు పాటదారుడు పాట ముగిసిన వెంటనే ఒక ఏడాది శిస్తు సొమ్ము ముందుగా చెల్లించాలన్నారు. అలాగే దేవస్థానం పేరున మూడు ఖాళీ చెక్కులు ఇవ్వాలన్నారు. హిందూ మతానికి చెందిన వారు మాత్రమే ఈ పాటకు అర్హులన్నారు. ఏ కారణం చేతనైనా పాట నిలుపుదల, వాయిదాకు దేవస్థానానికి పూర్తి అధికారం ఉందని స్పష్టం చేశారు

సోలార్ యూనిట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - రావికమతం : ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీలలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసినట్లు సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు తెలిపారు. గురువారం మండలంలోని కవగుంట గ్రామంలో విఆర్ఒ ప్రసాదు, సర్వేయర్ హరి ఆధ్వర్యంలో స్థలపరిశీలన జరిగింది.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాల్లో విద్యుత్ కోతల సమస్య నివారణకు అన్ని గ్రామాల్లో సోలార్ యూనిట్లును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. పూర్తిగా సాధారణ విద్యుత్‌పైనే ఆధారపడకుండా సోలార్ యూనిట్లు ఏర్పాటుతో విద్యుత్ కొరత, అవాంతరాల సమస్యలను అధిగమించే వీలుంటుందన్నారు.

ఈ మేరకు గ్రామాల స్థాయిని బట్టి, స్థలాన్ని కేటాయించి, అందులో సోలార్ యూనిట్ ఏర్పాటుతో సూర్యరశ్మి ద్వారా స్థానికంగా విద్యుదుత్పత్తికి అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు రెవెన్యూసిబ్బంది ఆధ్వర్యంలో స్థలపరిశీలన జరిగిందని, తదుపరి చర్యలు అధికారులు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో విఆర్ఎ శ్రీను, రాము పాల్గొన్నారు

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : సమానత్వం, స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం నిర్మితమైన రాజ్యాంగాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నంలో ఉందని, దాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఎఎంఎస్) అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు కళ్యాణ్‌రావు, జెవి.ప్రభాకర్ పేర్కొన్నారు. అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నూతన కమిటీని గురువారం పరిచయం చేశారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవి ప్రభాకర్ మాట్లాడుతూ, భారతీయులంతా స్వేచ్ఛ సమానత్వంతో బతికేందుకు రాజ్యాంగం ఏర్పాటైందని తెలిపారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ తమ సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలన్నిటినీ విక్రయిస్తూ ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లను దూరం చేస్తూ ఉపాధి లేకుండా పన్నాగం పన్నుతున్నారన్నారని విమర్శించారు. ప్రయివేటు రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కేంద్ర మంత్రులు ఎంపీలకు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ భవన్ (ఎఎంఎస్) ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కోశాధికారి జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అలమండ ప్రసాద్, సహాయ కార్యదర్శులు బత్తుల గౌతం, పతివాడ రాంబాబు, చిరంజీవి, రాజాన సరస్వతి, అప్పారావు, ఎస్.రాజులు పాల్గొన్నారు.

ఎపిఒగా చిన్నారావు



ఎపిఒ చిన్నారావు

ప్రజాశక్తి - రావికమతం :. రావికమతం మండల ఉపాధి హామీ పథకం ఎపిఒగా చిన్నారావు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎపిఒగా పనిచేసిన కాశీ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంగా నాతవరం మండలంలో ఎపిఒగా పనిచేసిన చిన్నారావును బదిలీపై నియమించగా, ఆయన విధుల్లో చేరారు.ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం అమలులో రావికమతం ముందంజలో ఉండేలా కృషి చేస్తానన్నారు. వలస బాట పట్టకుండా కూలీలందరికీ ఉపాధి కల్పిస్తామని, అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కూలీలకు దినసరి వేతనం రూ.300 వచ్చేలా మార్కింగ్ ద్వారా పనిచేయాలన్నారు. వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా, ఉదయం ఆరుగంటలకే పనిలోకి వచ్చి, ఎండల తీవ్రత ఎక్కువ కాకుండా 11గంటలలోపే కూలీలంతా ఇళ్లకు చేరుకునేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్స్ బాధ్యత తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ సిబ్బందికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూలీలు సహకరించాలని కోరారు.

నేడు అనకాపల్లిలో బిసిల సమరభేరి



వాల్‌పోస్టర్లు అతికిస్తున్న బిఎస్‌పినేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : బిఎస్‌పి ఆధ్వర్యంలో ఈనెల 11న శుక్రవారం అనకాపల్లిలో నిర్వహించబోయే బిసిల సమరభేరి కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పార్టీ నర్సీపట్నం ఇన్‌చార్జ్ బొట్టా నాగరాజు పిలుపునిచ్చారు. నర్సీపట్నం టౌన్‌లో నాగరాజు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. వాల్‌పోస్టర్లు అతికించారు. కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈ కార్యక్రమాన్నినేతృత్వంలో నాయకులు, కార్యకర్తల. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద బిఎస్‌పి ఆధ్వర్యంలో నిర్వహించే బిసిల సమరభేరివిజయవంతం చేయాలన్నారు. బిసిలకు 52 శాతం రిజర్వేషన్లు, కుల గణన నిర్వహించి, జనాభా ప్రాతిపదికన విద్య, వైద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఎస్‌పి నేతలు చిటికెల అప్పలనాయుడు, కొల్లి గంగాధర్, ఆనంద్, సూరిబాబు, నూకరాజు, అచ్చిబాబు, రాజు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కంటి జబ్బులకు సత్వర వైద్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : సెల్ ఫోన్ ప్రభావంతో కళ్ల జబ్బులకు గురయ్యే పిల్లలకు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి వైద్యులు వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. సీతమ్మపేటలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. పిల్లల ప్రత్యేక ఓపి, శస్త్ర చికిత్సల వార్డులను పరిశీలించారు. సెల్ ఫోన్లు అనర్థాలపై అవగాహనా కల్పించాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం ఫీడర్ మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎఇ అప్పలనాయుడు తెలిపారు. చందక, పోడుగుపాలెం, వెంకటాపురం, జగన్నాధపురం, గొట్టిపల్లి, కుసులవాడ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : వేములవలస జంక్షన్ వద్ద విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం పోలీసులు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని ప్రదర్శనలిచ్చారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలుగు ప్రయోజనాలు, ట్రిబుల్ రైడింగ్ వల్ల నష్టాలు, ఓవర్ స్పీడు, సిగ్నల్ జంపింగ్, కారు డ్రైవింగ్‌లో సీటు బెల్టు, ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల శంకర్, రాజు, శంకరరావు పాల్గొన్నారు.

సీతమ్మధార : విద్యార్థి దశనుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని నాలుగో పట్టణ ట్రాఫిక్ సిఐ అమ్మినాయుడు సూచించారు. అక్కయ్యపాలెం జాతీయ రహదారి వద్ద పెన్ స్కూల్ విద్యార్థులతో కలిసి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. రహదారి నిబంధనలు పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చని సిఐ తెలిపారు.

అవిశ్వాసానికి జనసేన మద్దతు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై జనసేన కార్పొరేటర్లు ఏకాభిప్రాయంతో అవిశ్వాసానికి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. సీతంపేటలోని జనసేన కార్యాలయంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ వసంత లక్ష్మి ఆధ్వర్యాన 11 మంది కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. అవిశ్వాసంపై కార్పొరేటర్లకు పలు సూచనలిచ్చారు. దల్లి గోవింద్, మూర్తియాదవ్, కందుల నాగరాజు, సాదిక్, లీలావతి, మేరీ జోన్స్, ఉషశ్రీ, పూర్ణశ్రీ, సూర్యకుమారి, కంటిపాము కామేశ్వరి పాల్గొన్నారు.

నష్టపోయిన ఇంటికి రూ.25 లక్షల పరిహారం

● అధికారులకు విన్నవించిన నిర్వాసితులు, సిపిఎం నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి :వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో చందనాడ పంచాయతీలో ఇల్లులు కోల్పోయిన వారికి రూ.25 లక్షలు,ఉపాధి కోల్పోతున్న వారికి రూ.18 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేశారు.గురువారం చందనాడ తుఫాన్ భవనం లో నర్సీపట్నం ఆర్‌డిఒ వి రమణ ఆధ్వర్యంలో తహసిల్దార్ నరసింహామూర్తితో కలిసి కారిడార్ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పై గ్రామసభ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్‌డిఒ రమణ మాట్లాడుతూ చందనాడ, తమ్మయ్యపేట,తుమ్మల పేట గ్రామాల్లో 2024 డిసెంబర్ 31 నాటికి 18ఏళ్ల నిండి ప్యాకేజీ కి అర్హులుగా 346 మంది లబ్ది దారులను గుర్తించి జాబితాను రూపొందించా రన్నారు. ఒక్కొక్కరికి 8.36లక్షల ప్యాకేజీ, పెదబోదుగలం రెవెన్యూలో 5 సెంట్లు ఇంటి స్థలం కేటాయిస్తామని వెల్లడించారు. అర్హత కలిగి ప్యాకేజీ లిస్ట్ లో పేర్లు లేని వారు వారం రోజులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూ సమస్యలుంటే పరిష్కారం చేపడతామన్నారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి నాయకులు వీసం రామకృష్ణ, తదితరులు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి నిర్మాణ ఖర్చులు పరిగణనలోకి తీసుకుని 18ఏళ్ల నిండిన వారికి రూ.25 లక్షలు, రైతుల దగ్గర భూములు స్వాధీనం చేసుకోవడం వలన ఉపాధి కోల్పోతున్న కూలీలు, వివిధ వృత్తిదారులకు, దళితులకు రూ.15 లక్షలు చొప్పున ప్యాకేజీ చెల్లించాలన్నారు., అర్హత ఉన్న వారిలో అవార్డు ప్రకటించిన తేదీ నాటికి 18 ఏళ్ల నిండి వివాహిత మహిళలకు కూడా రూ.25 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, అమలాపురం సర్పంచ్ శంకర్రావు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పుణ్యమంతుల బాబ్జి, రోకళ్ళ గోవిందరావు,పుణ్యమంతుల సత్తిబాబు,తళ్ళ అప్పలస్వామి ,సూరకాసుల పెదకాపు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాసితులు,నాయకులు

21న ఆదర్శ పాఠశాల ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి- చీడికాడ/ రావికమతం : ఎపి ఆదర్శ పాఠశాలల్లో 2025- 26 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్షను ఈనెల 20న కాకుండా 21వ తేదీ నిర్వహించనున్నట్లు చీడికాడ, రావికమతం మండలం మరువాక ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపల్స్ వెంకటలక్ష్మి, కె.సత్యసునీల్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రాష్ట్రంలోని 164 మోడల్ స్కూల్స్‌లో ఆరోతరగతి ప్రవేశానికి ఈనెల 20న ప్రవేశపరీక్ష నిర్వహించాలని ముందుగా నిర్ణయించినప్పటికీ, ఆరోజున ఈస్టర్ సండే కావడంతో ఈనెల 21న సోమవారం ప్రవేశపరీక్ష తేదీని మార్పుచేసినట్లు వెల్లడించారు. ఈ మార్పును విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు గమనించి, ఆయా మండలాల్లో 21న సోమవారం ఉదయం 19గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించే ప్రవేశపరీక్షకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను www.cse.ap.gov.in లేదా www.apms.apcfss.in వెబ్‌సైట్లన ఉంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష తేదీ మార్పును గమనించాలని కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ సెట్ అందజేస్తున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి -రోలుగుంట : నర్సీపట్నం నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.30వేల విలువ గల కంప్యూటర్‌ను అందజేశారు. గురువారం కంప్యూటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నవ్య లయన్స్ క్లబ్ సెక్రటరీ సుతాపల్లి చైతన్య మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో నర్సీపట్నం చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే నవ్య లయన్స్ క్లబ్ సభ్యులైన పివిఎం.నాగజ్యోతి అభ్యర్థన మేరకు పాఠశాలకు క్లబ్ సభ్యుల ఆర్థిక సహాయంతో కంప్యూటర్‌ను అందజేశామన్నార. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు బేతిరెడ్డి విజయకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశంగా ట్యాంక్ బండ్ అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న టిడిపి నేత విజయ్, కార్పొరేటర్ పద్మావతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :నర్సీపట్నం ట్యాంక్‌బండ్‌ను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేస్తామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గురువారం పట్టణంలోని 6, 7, 9వ వార్డుల్లో సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి సంబంధించిన 7 పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ వరుసగా నాలుగో రోజు శంకుస్థాపనలో పాల్గొన్నారు. ప్రతీ వార్డులో స్థానిక మహిళలు హారతులతో స్వాగతం పలకడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ మూడు వార్డుల్లో అభివృద్ధి పనులకు రూ.54 లక్షలు కేటాయించగా, ఒక్క ఏడవ వార్డులో ఒకే ఒక్క రోడ్డుకు రూ.46 లక్షలు మంజూరయ్యాయన్నారు. మున్సిపాలిటీ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఖాళీ స్థలాలను చెత్తతో నిండిపోయి డంపింగ్ యార్డుల్లా మారుతున్నా పట్టించుకోని స్థల యజమానులకు మున్సిపాలిటీ తరఫున నోటీసులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో 6వ వార్డు ఇన్‌ఛార్జ్ మార్కెట్ రాజా, మల్ల నాగేశ్వరరావు, సూరిబాబు, 7వ వార్డు కౌన్సిలర్ రావాడ లక్ష్మి, రావాడ నాయుడు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం

గ్రామీణ పేదల పొట్ట కొడుతోన్న కేంద్రం : వ్యకాస నేత వెంకన్న



మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న

ప్రజాశక్తి- మాడుగుల : కేంద్రం ప్రభుత్వ గ్రామీణ ఉపాధి హమి కూలీలు పొట్టకొడుతోందనిఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి అన్నారు. గురువారం మాడుగులలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఈ ఏడాది మార్చి 21నాటికి రూ. 26,097.23కోట్లు ఉపాధి హామీ నిధులు బకాయి ఉందని, అందులో ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన రూ.2,030 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ మొత్తంలో కార్మికుల వేతనాల కింద రూ.15,277 కోట్లు, సామగ్రి, పాలనా పరమైన ఖర్చుల కింద రూ.10,820.23 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు ఎపుడు ఆందోళన చేసినా రాష్ట్రాలు ఇంకా పద్దులు సమర్పించలేదని కుంటిసాకులు చెబుతూ తప్పించుకుంటోందన్నారు. కేంద్రం చెల్లింపుల నిలుపుదలతో గ్రామీణ కార్మికుల జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పాలిత 'డబుల్ ఇంజన్' రాష్ట్రాల్లో కూడా పెద్ద మొత్తాల్లోనే బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆ రాష్ట్రాలు కూడా ఇంకా పద్దులు అంద చేయలేదనే వాదననే కేంద్ర ప్రభుత్వం చేస్తుందాయని ప్రశ్నించారు. ఉపాధి హామి నిధుల విడుదలలో జాప్యంతో గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులకు ఆటంకం కలుగుతోందన్నారు. కోట్ల మంది పేద కూలీలకు జీవనాడిగా వున్న గ్రామీణ ఉపాధి హామీ పనులకు అవసరమైన నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం, ఈ పథకం ఆశయాన్ని నీరుగారుస్తూ, క్రమేణా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఉందని వారు మండిపడ్డారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులను చేస్తున్న వెంకటేష్

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేట పంచాయతీ గ్రామంలో పంచాయతీ ఉపసర్పంచ్ పిక్కి కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో 60 జట్లు తలపడ్డాయి. రాజయ్యపేట క్రికెట్ టీం విజేతగా నిలిచింది. విజేత రాజయ్యపేట టీమ్‌కు మొదటి బహుమతిగారూ. 30 వేలు, రన్నరప్‌కు రూ. 20 వేలు, 3వ బహుమతిగా రూ. 10వేలు నిర్ణయించారు. విజేతలకు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్. బహుమతులను అందజేశారు. జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), రాజయ్యపేట మాజీ వైస్ ప్రెసిడెంట్ అప్పలరాజు, సుధా రాజు,వాసుపల్లి యేసు, తాతాజీ,పిక్కీ చిన్నారి, పిక్కి నూకరాజు, బొంది యోన పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

● రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత



వికలాంగుని సమస్య వింటున్న హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి :ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలు అన్నిటినీ పరిశీలించి, పరిష్కారచర్యలు చేపడతామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం మండలంలో సారిపల్లిపాలెంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలో వివిధ నియోజకవర్గాల తోపాటు, పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సమస్యలను ఇచ్చేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. హోం మంత్రి అనిత అర్జీదారులను స్వయంగా కలిసి, ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ, వారి గోడు వింటూ, వినతులు స్వీకరించారు. తన శాఖపరిధిలోని సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు పాయకరావుపేట నియోజకవర్గ ప్రజల కోసం తన కార్యాలయం ఎపుడూ తెరిచే ఉంటుందన్నారు. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. ప్రజాదర్బార్‌లో 600కు పైగా అర్జీలు రాగా, భూసమస్యలు, కొత్త ఫించన్లు,పెంషన్ కార్డులు, కుటుంబ కలహాల కేసులు, తదితర అంశాలపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయి.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై తక్షణమే పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చెయ్యాలని అధికారులను ఆదేశించారు.

హోంమంత్రిని కలిసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ

పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వర రావు, డెరెక్టర్లు నక్కపల్లి లో హోంమంత్రి అనితను మర్యాద పూర్వకంగా కలిశారు. తమను ఎఎంసి కమిటీలో నియమించడంపై ధన్యవాదాలు తెలిపారు. కాగా కమిటీ ప్రతినిధులను హోంమంత్రి సత్కరించారు.

ఇళ్లస్థలాలు కేటాయించాలని జర్నలిస్టుల వినతి

తమకు ఇళ్లస్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎపియూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు స్వామి, జిల్లా అధ్యక్షులు పెంటకోట జోగినాయుడు, ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు, యూనియన్ నాయకులు, హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. 2018లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఉపమాక పంచాయతీ సారిపల్లిపాలెంలో సర్వేనెంబర్ 193లో 75 సెంట్లు భూమిలో 26 మంది పాత్రికేయులకు ఇంటిపట్టాలు ఇచ్చారని,2019లో వైసిపి అధికారంలోకి రాగానే ఆస్థలాన్ని జగనన్న లేఔట్‌కు కేటాయించి, పాత్రికేయులకు అన్యాయం చేశారని గుర్తుచేశారు. పాత్రికేయులకు అప్పటో కేటాయించిన ఇంటి స్థలాలను ఇవ్వాలని, నక్కపల్లిలో ప్రెస్‌క్లబ్ భవనం, అక్రిడిటేషన్ ఇతర సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

కల్లుగీత కార్మికుని కుటుంబానికి అండ

తాటిచెట్టు పైనుంచి పడి మంచానికే పరిమితమైన మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు, తెలుగుదేశం పార్టీ కార్యకర్త దొంగల శ్రీనును స్థానిక నేతలతో కలిసి వెళ్లి హోంమంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. శ్రీనుకు వెంటనే ఆపరేషన్ చేయిస్తానన, వారి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి అనిత భరోసానిచ్చారు. శ్రీను భార్యను ఓదార్చారు.



బాధిత గీత కార్మికుడిని పరామర్శిస్తున్న అనిత